నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జూలై 31, 2024 | www.navatelangana.com

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

ఖానాపూర్: మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పలువురు ఉద్యోగులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం సభ్యులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం మాట్లాడుతూ ఇన్ని రోజులు వారు చేసిన సేవలను కొనియాడారు. మరింత అంకితభావంతో పని చేస్తే చిన్న స్థాయి ఉద్యోగం నుండి పెద్ద స్థాయి ఉద్యోగం వరకు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు కారింగుల సంకీర్తన సుమన్, జన్నారపు విజయ లక్ష్మీశంకర్, నాయిని స్రవంతి సంతోష్, పరిమి లత సురేష్, ఆఫ్రిన్ అమనుల్లాఖాన్, కిషోర్ నాయక్, అబ్దుల్ ఖలీల్, కుర్మా శ్రీనివాస్, పౌజియ షబ్బీర్ పాషా, కో ఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఇన్‌చార్జి మేనేజర్ సురేందర్ పాల్గొన్నారు.



రుణమాఫీపై సంబురాలు

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీలో భాగంగా లక్షా50వేల వరకు రుణమాఫీ చేయడంతో మంగళవారం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్ర సమీపంలోని రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని రైతులు, అధికారులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి, డీఎల్పీఓ ఫణిందర్‌రావ్, ఇన్‌చార్జి ఎంపిడిఓ రవీందర్‌రావ్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



సింగరేణి తెలంగాణ హక్కు..!

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య
- కొనసాగుతున్న సింగరేణి పరిరక్షణ యాత్ర

నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణిని కాపాడుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మొండివైఖరిని తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ యాత్ర మంగళవారం రామకృష్ణాపూర్, బీ-జోన్, మందమర్రి, శ్రీరాంపూర్ మీదుగా నస్పూర్‌కు చేరుకుంది. నస్పూర్‌లోని సిర్కే సెంటర్‌లో సాయంత్రం ఏర్పాటు చేసిన సభలో ఆశయ్య మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో కొచ్చిన బీజేపీ బొగ్గు గనుల వేలానికి పూనుకుందన్నారు. సరళీకరణ విధానాల్లో భాగంగా ఆదానీ, అంబానీలకు సింగరేణి సంస్థను అప్పజెప్పాలని చూస్తోందని మండిపడ్డారు. అందులో భాగంగానే శ్రావణపల్లి ఓసీని ప్రయివేటీకరించడానికి యత్నిస్తోందన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ ఓసీని వేలం పాటకు పెట్టడం తెలంగాణకే సిగ్గు చేటన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా మద్దతు తెలుపుతోందని పేర్కొన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిని మోడీ బొందల గడ్డగా మార్చాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు బొగ్గు బ్లాకులను వేలానికి వేసిందని, ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ కూడా అధికారంలోకి వచ్చాక బీజేపీకి మద్దతు తెలుపుతోందని విమర్శించారు. కొత్త బావులు ఏర్పాటు చేయాల్సింది పోయి సింగరేణి కార్మికుల పొట్టగొట్టే ప్రయత్నాలను బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ ప్రజలు మేల్కొని హక్కు అయిన సింగరేణి కోసం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. దీనికి సీపీఐ(ఎం) మద్దతు ఇస్తుందని తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ తెలంగాణకు బువ్వ పెట్టే సింగరేణి తల్లికి బీజేపీ ప్రభుత్వం ఉరి తాడు వేసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టాక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఇప్పటికే జియో తీసుకొచ్చి బిఎస్ఎన్ఎల్‌ను చంపేశారని, అదే విధంగా బొగ్గు బావులను ఆదానీ, అంబానీ చేతికి వెళ్తే మనకు బువ్వ దొరకదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ప్రయివేటీకరణ అయితే సింగరేణి కార్మికులు, కుటుంబాలు అనాథలుగా మరుతారన్నారు. ఇంత మంది కడుపు కొట్టి ఆదానీ, అంబానీల కడుపు నింపాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు గట్టి సమాధానం చెప్పాలని కోరారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా మోడీ బాట పట్టిందని, ఎన్నికల ముందు సింగరేణికి హామీల వర్షం కురిపించిన మంచిర్యాల జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు శ్రావణపల్లి ఓసీని కాపాడాలని డిమాండ్ చేశారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ ప్రయివేటీకరణ కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యుడు రంజిత్‌కుమార్, మెడవెల్లి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సభలో అభివాదం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు



మాట్లాడుతున్న సంకె రవి



మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య



కార్మికుల బైక్ ర్యాలీ

ఏఆర్ఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం(ఏఆర్ఎస్)లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి వ్యవసాయ పరిశోధనా స్థానం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ 15,20 సంవత్సరాలుగా ఏఆర్ఎస్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. కార్మికులకు ప్రతినెలా 26 పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రోజూ వేతనం రూ.700 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అదనపు పనులకు పారితోషికాలు ఇవ్వాలని, ఇవ్వలేని పక్షంలో అదనపు పనులు చేయించకూడదని స్పష్టం చేశారు. పనిదినాన్ని ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, కమిటీ సభ్యులు పండుగ పొచ్చన్న, ఏఆర్ఎస్ నాయకులు ఏ.శరత్, లక్ష్మి, రిజ్వాన, కిష్టమ్మ, నర్సింగ్, రవి, సంగీత, గంగామణి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలకు విశేష స్పందన వచ్చింది. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్‌లో ఆఫీస్, బీఎం, టెక్నికల్ మేనేజర్ పోస్టుల కోసం మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. పట్టణంతో పాటు చుట్ట పక్కల గ్రామాలు, మండలాల నుంచి నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ఆయా విభాగాల్లో ఉద్యోగం, వేతనాల వివరాలను తెలియజేశారు. ఈ మేళాను ఎంప్లాయిమెంట్ అధికారి మిల్కా పర్యవేక్షించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్‌లో ఖాళీలను భర్తీ చేయడానికి జాబ్ మేళాను నిర్వహించామన్నారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో రావడంతో జాజ్ మేళా విజయవంతమైందన్నారు. ప్రయివేట్ ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఎంప్లాయిమెంట్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు ఎంత మంది ఉన్నారో ప్రభుత్వానికి నివేదించడానికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గోవర్ధన్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిర్మల్‌లోని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యాలయ ఆడిటోరియంలో వెన్నెల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ఆదిలాబాద్ బాలకేంద్రం చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య, బృంద నాట్యం, సోలో విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, వెన్నెల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ ధనరాజ్, డా.మురళీకృష్ణ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బాలకేంద్రం పర్యవేక్షకులు మిట్టు రవి, బాలకేంద్రం తల్లిదండ్రుల సంఘం సభ్యులు ఉపాధ్యక్షులు సృజన ఉమా, వీరేశ్, ఇందన్న, పరుశురాం పాల్గొనగా చిన్నారులను అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ కార్యకర్తలను కోరారు. మంగళవారం స్థానిక రాధాకృష్ణ మందిరంలో మండల, గ్రామ స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ఎంపి ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించి జిల్లా స్థాయిలో కాషాయ జెండాను ఎగురవేసిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రితీష్ రాథోడ్, మండల అధ్యక్షులు ఆరేళ్లి రాజలింగం, మరప్ప రాజు, దీపక్ సింగ్ షెకావత్, కనక తుకారాం పాల్గొన్నారు.

లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, జడ్పీ సీఈఓ రత్నమాల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యం 44లక్షల6వేల మొక్కలకుగాను ఇప్పటి వరకు 19లక్షల11వేల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున సమయం వృథా కాకుండా వెంటనే మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేన్, ప్రభుత్వ సంస్థలలో మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం ఉపయోగపడే విధంగా మునగ, చింతపండు, కరివేపాకు తదితర మొక్కలు నాటాలని సూచించారు. రైతులకు కావాల్సిన ఉద్యానవన పండ్ల తోటలకు సంబంధించి మొక్కలు నాటించాలని సూచించారు. వన మహోత్సంలో పెద్ద మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్క బతికే విధంగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని, జియో ట్యాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. నర్సరీల పరిరక్షణ ముఖ్యమని, నర్సరీలలో కలుపు రాకుండా చూడాలని, షిఫ్టింగ్ గ్రేడింగ్ నిర్వహించాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు తరచూ మొక్కల పెరుగుదల, సంరక్షణపై తనిఖీలు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. మొక్కలు నాటిన తీరును మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖర్జూర, ఈత మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలిపారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాలలో, ఏజెన్సీ ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని, విష జ్వరాలు రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న దృష్ట్యా ప్రజల రాకపోకలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పంచాయతీ సెక్రటరీ, కారోబార్‌లను ఆదేశించారు. పాఠశాలల్లో, హాస్టల్‌లో చెత్తాచెదారం లేకుండా సానిటేషన్‌పై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, జడ్పీ సీఈఓ రత్నమాల, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాకాలం సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తక్షణమే ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సి ప్రకటించాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదరి పూసం సచిన్, జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ మండలాలైన గుడిహత్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, బోథ్ ప్రాంతాల్లో విష జ్వరాలతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రాల్లో, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం తరపున మెడికల్ క్యాంపులు ఉచితంగా ఏర్పాటు చేసి మందులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. అలాగే ఉట్నూర్, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఓపి సమయాన్ని సాయంత్రం వరకు పొడిగించాలని, దీనికోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ మండలాల్లో అంబులెన్సుల సంఖ్య పెంచాలని, సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను కాపాడాలని విన్నవించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



నవతెలంగాణ-సారంగాపూర్

పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ గంగారెడ్డి తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎస్సైని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాలను నియంత్రించడంతో పాటు శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలగాలంటే విజిబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యపడుతుందన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు, పెట్రో కార్, బ్లూ కోల్ట్ సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. అనంతరం డీఎస్పీ సిసి కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్ ఫైల్స్, చోరీలు, ఐటీ కేసుల స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పద్ధతులను పాటించాలన్నారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ రూరల్ సిఐ బి.శ్రీనివాస్, ఎస్ఐ ఎస్.శ్రీకాంత్, ఏఎస్ఐ వసంత్ పాల్గొన్నారు.

35శాతం లాభాల వాటాను వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థకు వచ్చిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, అందులో కార్మికులకు 35 శాతం వాటాన్ని చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్కె7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి ఏడు నెలల కాలం గడుస్తున్నప్పటికీ యాజమాన్యం ఇప్పటికీ గుర్తింపు సంఘం పత్రం ఇవ్వడంలో జాప్యం చేస్తుందన్నారు. గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకపోవడం వల్ల కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, గుర్తింపు సంఘం పత్రం ఇవ్వడం ద్వారా ఏరియా లెవెల్, కార్పొరేట్ లెవల్లో స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయడం వల్ల కార్మికుల సమస్యల పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. యాజమాన్యం వెంటనే గుర్తింపు పత్రాన్ని అందజేయాలన్నారు. అంతే కాకుండా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, నూతన బావులు రాకపోవడం వల్ల పాత బావులు మూసివేస్తున్నందున సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, సింగరేణి సంస్థకు భవిష్యత్తు ఉండాలంటే నూతన బొగ్గు గనులు రావాలన్నారు. తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను నామినేషన్ పద్ధతి ద్వారా సింగరేణి సంస్థకే కేటాయించడం వల్ల సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. నూతన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.27వేల కోట్లను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రావాల్సిన బకాయిలను చెల్లించడం ద్వారా సింగరేణి సంస్థ నూతన బొగ్గు గనులను ప్రారంభించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, ఏరియా కార్యదర్శి మారెపల్లి సారయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై కళాజాతా బృందం అవగాహన

నవతెలంగాణ-ఉట్నూర్



గ్రామాల్లో పారిశుధ్యంపై కళాజాత బృందం అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగానే తెలంగాణ సాంస్కృతిక సారథి ఆదిలాబాద్ బృందం ఆధ్వర్యంలో మండలంలోని ఆందోలి గ్రామంలో మంగళవారం వర్షాకాల వ్యాధులు జాగ్రత్తలు, సంపూర్ణ పారిశుధ్యం, వన మహోత్సవం, ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు టీమ్ లీడర్ చాహకటి రవి, గోడం ఆశీష్, శంకర్, రాథోడ్ గోవిందరావు, గుంజల రమేష్, మాధురి, రాజు, మురళి, వెంకట్‌రావు, రాజలింగు, నగేష్, నర్సమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ సంబరాలు

నవతెలంగాణ-నార్నూర్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు రుణమాఫీ రెండో విడతలో భాగంగా మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామ రైతువేదికలో గంగాపూర్, గుంజాల, జామడ, బేతాల్‌గూడ, బలాన్‌పూర్, నాగల్ కొండ తదితర గ్రామాల రైతులు ఏఈఓలు రుణమాఫీ సంబురాలు చేశారు. ప్రభుత్వం రెండో విడతలో రూ.లక్ష నుంచి రూ.లక్ష 50వేలు రుణమాఫీ విడుదల చేసిన సందర్భంగా టీవీలో వీడియో తిలకించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజేశ్వర్, సాయికృష్ణ, సైజాన్, నిఖిల్, నరేష్, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ సునీల్, కాంగ్రెస్ నాయకులు కుర్సెంగా నగేష్, సోంజి, విఠల్ ఉన్నారు.



వాగులు దాటి.. గ్రామానికి చేరి..



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. కొన్ని ఆదివాసీ గిరిజన గ్రామాలకు రోడ్డు బ్రిడ్జి లేకపోవడంతో వాగులు దాటి బురదలో నడుస్తూ గ్రామానికి చేరి వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ హెచ్ఈఓ రాథోడ్ రవీందర్, వైద్య సిబ్బంది ఉమ్రి వాగు దాటుతూ మాలేపూర్ చితగూడ గ్రామానికి బురదలో రెండు కిలో మీటరు నడిచి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు, బీపీ షుగర్ లక్షణాలు ఉన్న వారికీ మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుపై ముందు జాగ్రత్త అవగాహన కల్పించారు. వర్షం కాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది చంద్రకళ, శ్రీదేవి, వినోద్ ఉన్నారు.

స్వర్ణ నంది అవార్డు అందుకున్న మహేందర్



నవతెలంగాణ-ఉట్నూర్

స్వర్ణ నంది అవార్డు అందుకున్న మహేందర్ నాయక్‌ను మేడ్చల్ సీనియర్ సివిల్ జడ్జి జాదవ్ అజయ్ కుమార్ మంగళవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శనివారం హైదరాబాద్ నగరంలో మెగా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వర్ణ నంది సేవా కళాకార్ అవార్డును అందుకున్న శ్రీ స్వామి వివేకానంద యూత్ సభ్యులు రాథోడ్ మహేందర్‌ను యువత ఆదర్శంగా తీసుకుంటూ, ముందుకు సాగాలని అన్నారు. యువత తలుచుకుంటే గ్రామాన్ని, దేశాన్ని మార్చవచ్చని తెలియజేశారు. తమ గ్రామంలో శ్రీస్వామి వివేకానంద యూత్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చవాన్ గణేష్ పటేల్, గోప్లే నాను, మానే నాను, జాదవ్ శంకర్, వాగ్మారే సుభాష్, గైక్వాడ్ చతుర్భుజ్, జాదవ్ సుభాష్, రాథోడ్ వసంత్, గున్ను, రాథోడ్ హరి, రామ్ కిషన్, చిలుకూరి రాజు, జాదవ్ అజయ్ రాథోడ్, యువరాజ్, జాదవ్ విశ్వనాథ్, గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-తాంసి

డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ తులసీరామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో డెంగ్యూ నివారణ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలోని ఇంటింటి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అన్నారు. ఎవరైనా చలి జ్వరం వారం రోజుల నుంచి బాధపడుతున్నట్లు ఉంటే వెంటనే ఆశా కార్యకర్తలకు లేదా ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. డెంగ్యూ లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, వారికి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్సలు జరిగే విధంగా చూడటం జరుగుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంగన్న, ఏఎన్ఎం లక్ష్మి ఉన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

హరిత హారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జెఆర్ చవాన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మొక్కను నాటి, నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత హారంలో భాగంగా నాటుతున్న ప్రతి ఒక మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ సుభాష్ జాదవ్, ఏఈ రోహిదాస్, సిబ్బంది ప్రకాష్, రాహుల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తింపు సర్టిఫికేట్, గుర్తింపు కార్డు పొందిన ట్రాన్స్‌జెండర్‌ల నుంచి ఆర్థిక సాయం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల శాఖాధికారి సబితా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ట్రాన్స్‌జెండర్‌లు తమ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు శాఖ కార్యాలయంలో లేదా ఫోన్ నెంబర్ 08732-222058 ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఎలాంటి కోత విధించకుండా రెన్యువల్ చేయాలి

- రెండో విడత రుణమాఫీ
- ఆగస్టు లోపు మూడో విడత మాఫీ
- రూ.201 కోట్లు రైతుల ఖాతాల్లోకి



రైతులకు రుణమాఫీ చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రుణమాఫీలో బ్యాంకర్లు ఎలాంటి కోత విధించకుండా రెన్యూవల్ చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని లైవ్‌లో రైతులు, అధికారులతో కలిసి వీక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో రుణమాఫీ చేస్తూ రైతులకు చెక్కులను అందించారు. ఇక్కడ కూడా కలెక్టర్ పలువురు రైతులకు చెక్కులను అందించారు. అంతకుముందు మొదటి విడతలో రూ.లక్ష మాఫీ అయిన రైతులతో పాటు రెండో విడతలో రూ.లక్ష 50 వేలలోపు రైతుల అభిప్రాయాలను సేకరించారు. బ్యాంకర్లు రుణమాఫీ రైతుల వివరాలను ప్రదర్శించాలన్నారు. అదే విధంగా మొదటి విడతలో తమ రుణం మాఫీ కాలేదని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఖాతాలున్న రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ విషయంలో రాష్ట్ర నోడల్ అధికారితో మాట్లాడటం జరిగిందని, రైతులు అధైర్యపడొద్దన్నారు. జిల్లాలో 17 వేల 647 మందికి రూ.201 కోట్లు మాఫీ అయ్యాయని తెలిపారు. మొదటి విడతలో 18 వేల 740 మందికి రూ.120 కోట్లు మాఫీ అయ్యాయని వివరించారు. నేడు రైతులు పండుగ వాతావరణంలో సంబురాలు జరుపుకుంటున్నారన్నారు. సాంకేతిక కారణాలతో కొంత మందికి మాఫీ కాలేదన్నారు. దాన్ని సరి చేయడానికి రాష్ట్ర నోడల్ అధికారికి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రతి మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదుల విభాగం పెట్టామన్నారు. రుణ మాఫీ కానీ అర్హులైన రైతులు అక్కడ ఫిర్యాదు చేస్తే 30 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఆగస్టు వరకు రెండు లక్షల రుణమాఫీ కూడా జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు అధైర్యపవద్దని ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం ఉత్పల్ కుమార్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం
- 80 శాతం రోడ్డు ప్రమాదాలతో మరణాలు
- ఉత్తమ డ్రైవర్లకు పురస్కారాల ప్రదానం



ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఆర్టీసీ డ్రైవర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర చాలా కీలకమని మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా తమ సర్వీసులో అత్యధిక కాలం పాటు ప్రమాద రహితంగా బస్సులను నడిపిన ఆర్టీసీ డ్రైవర్లకు ఉత్తమ పురస్కారాలను అందించారు. రీజియన్ పరిధిలో తొలి మూడు స్థానాలను దక్కించుకున్న నిర్మల్ డిపోకు చెందిన డ్రైవర్లు సిబి.రావ్, మినాజుద్దీన్, ఆసిఫాబాద్ డిపోకు చెందిన అన్వర్‌తో పాటు ప్రతి డిపో నుంచి ముగ్గురు చొప్పున మొత్తం ఆరు డిపోలకు చెందిన 18 మంది డ్రైవర్లకు ఆర్ఎంతో కలిసి పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 80 శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, దేశంలో సాధారణ మరణాల రేటు కంటే రోడ్డు ప్రమాదాలతో జరిగే మరణాల రేటు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. 30 సంవత్సరాలు సర్వీసులో ప్రమాదరహితంగా డ్రైవింగ్ చేయడం సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. 80 శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలతో జరిగితే అందులో 70 శాతం ప్రమాదాలు అధికవేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఆల్కహాల్ తీసుకుని నడపడం వల్ల సంభవిస్తున్నాయన్నారు. మరికొంత శాతం ప్రమాదాలు రహదారులు, వంతెనల నిర్మాణాల్లో సాంకేతిక లోపాలతో జరుగుతున్నాయన్నారు. అయితే ప్రమాదం జరిగిన సందర్భంలో డ్రైవరే తొలి ముద్దాయిగా నిలబడాల్సి వస్తుండటం విచారకరమన్నారు. ప్రతి ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణం అయి ఉండకపోవచ్చన్నారు. కొత్త బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవర్‌పై నెపం రాకుండా సాంకేతిక ఆధారం లభించినట్లు అవుతుందన్నారు. పోలీసుశాఖ తరఫున సైతం రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి జరుగుతోందన్నారు. ప్రమాదరహిత డ్రైవింగ్‌లో ఆదిలాబాద్ రీజియన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్, పీఓ గిబ్లా, మంచిర్యాల, నిర్మల్, భైంసా డిపోల మేనేజర్లు జనార్ధన్, ప్రతిమారెడ్డి, హరి ప్రసాద్, ఆర్ఎం కార్యాలయ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కిరణ్ కుమార్, రాజేందర్, విలాస్, శ్రీకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తిథి భోజనాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రణీత

నవతెలంగాణ-తలమడుగు

శిక్షా సప్తాహ ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో తిథి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ ప్రణీత హాజరై మాట్లాడారు. విద్యార్థులకు అదనంగా పోషకాహారాన్ని అందించేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఇంతకుముందు నుండే కొనసాగడాన్ని అభినందించారు. తర్వాత పదో తరగతి విద్యార్థులకు ప్రతి రోజు బడికి రావాలని క్రమశిక్షణతో పాఠాలు విని సందేహాలు ఏమైనా ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఇప్పటి నుండే విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని రివిజన్ చేయాలన్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఎన్ఏఎస్‌పై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఒరియంటేషన్ కార్యక్రమాన్ని ఉద్యేశించి మాట్లాడారు. విద్యార్థులను ఎన్ఏఎస్ టెస్ట్‌కు సిద్ధం చేయాలని, మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, వెంకట్‌రావ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమారి, ప్రత్యూష ఆర్పీలు శంకర్, నగేష్, సంతోష్, శ్రీనివాస్, జెడ్పీఎస్ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాంసి : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని కాంగ్రెస్ నాయకులు, కప్పర్ల మాజీ ఎంపీటీసీ కొడల సంతోష్, మాజీ సర్పంచ్ కొడల నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని కప్పర్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కమ్యూనిటీ సహకారంతో మరింత పౌష్టికాహారం అందించాలనే ఉద్యేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తిథి భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. స్థానిక యువ నాయకులు గంద్రత్ అరుణ్ తన వంతుగా రూ.5వేలు అందజేశారు. దీంతో తిథి భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గంద్రత్ అరుణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు కిష్టన్న, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



తాంసి

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

రెండు ఆలయాల్లో దొంగతనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెండు ఆలయాల్లో దొంగతనం జరిగిన సంఘటనలు జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నాయి. పట్టణంలోని రాంనగర్ కాలనీలో గల రామాలయంలో చోరీ జరుగగా మంగళవారం తెల్లవారుజామున ఆలయ కమిటీ సభ్యులకు పోలీసులు చోరీ జరిగినట్టు సమాచారం అందించారు. ఆలయంలోని హుండిని పగలగొట్టి అందులోని నగదును తీసుకెళ్లారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి వరకు ఆలయంలో భజనలు చేశామన్నారు. తెల్లవారు జామున ఆలయంలో చోరీ జరిగినట్టు పోలీసులకు సమాచారాన్ని ఇచ్చారని తెలిపారు. ఇక్కడికి వచ్చి చూసే వరకు హుండి పగిలి ఉందన్నారు. రామనవమి నుంచి హుండిని తీయలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇదిలా ఉంటే అదే కాలనీలోని పోచ్చమ్మ ఆలయంలో కూడా చోరీ జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.



తహసీల్దార్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల తహసీల్దార్‌గా శ్రీకాంత్ ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. కాగా కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మండలంలో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ రావుల గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, కిషన్ పటేల్, వాహజ్, దిగంబర్, అజీజ్, ఖాలిద్ పటేల్ పాల్గొన్నారు.

తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లోని తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ జవహర్ లాల్ సూచించారు. మంగళవారం పంచాయతీ కార్మికులతో మండల కేంద్రంలోని జీన్‌గూడ, అన్నాబావు సాఠే నగర్, అంబేద్కర్‌నగర్, విజయ్‌నగర్ వార్డులోని బావుల్లో క్లోరినేషన్ చేయించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బావి పరిసరాల ప్రాంతంలో చెత్త చెదారం పిచ్చి మొక్కలు లేకుండా కార్మికులు, ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నూతన ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రాంప్రసాద్‌ను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, లక్కారం మాజీ ఉపసర్పంచ్ కోల సత్యాన్న, మాజీ ఎంపీటీసీ మనోహర్, శ్రీనివాస్, ఉట్నూర్ వైట్ యూత్ అధ్యక్షులు సాజిద్ సిద్దికి పాల్గొన్నారు.

108 సిబ్బందికి ఘన సన్మానం



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గ కేంద్రంలోని 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న 108 ఈఎంటీ దొంతుల పండరి, పైలెట్ నస్రుల్లాఖాన్‌కు ఇటీవల లైఫ్ సేవియర్ అవార్డు వచ్చింది. దీంతో 108 సిబ్బందికి మంగళవారం రబింద్ర హై స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సాయినాథ్ కరస్పాండెంట్ రాజేందర్‌లు ఘనంగా సన్మానించారు. వీరి సేవలను అభినందించారు. ఆపద సమయంలో 108 సేవలు చాలా ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. అనంతరం 108 అంబులెన్స్ సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు 108కు సమాచారం అందించాలని వారు కోరారు.

వర్షాకాలం జాగ్రతలు పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప వాగు దాటి బయటికి రావద్దని సీఐ రహీమ్ పాషా, ఎస్సై మహేష్ తెలిపారు. మంగళవారం నార్నూర్ మండలంలోని మలంగి గ్రామపంచాయితీ పరిధిలోని బారీక్‌రావ్ గూడ, గాదిగూడ మండలంలోని మారుగూడ గ్రామ ప్రజలకు వాగు దాటే సమయంలో తాడు సహాయంతో ఎలా రావాలో డీడీఆర్ఎఫ్ పోలీసు బృందం ద్వారా అవగాహన కల్పించారు. పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పనులను పర్యవేక్షించిన ఐటీడీఏ అధికారులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని హీరాపూర్ అమరవీరుల స్థూపం వద్ద కొనసాగుతున్న స్మృతి వనం పనులను ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారి డిప్యూటీ ఈఈ. శివగణేష్ పరిశీలించారు. రూ.95 లక్షలతో చేపడుతున్న పనులను గడువులోగా పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు. స్థూపం చుట్టు మెట్లు, జరుగుతున్న ప్రహరి గోడ పనులను పర్యవేక్షించారు.



ఎస్సీల వర్గీకరణ దీక్ష విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎస్సీల వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి కోరారు. మంగళవారం నాయకులతో కలిసి దీక్ష కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మాదిగలను స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. బీజేపీ గతంలో తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచిందని గుర్తు చేశారు. పదేండ్లు అయిన కనీసం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మాదిగలు మేల్కొని పెద్ద ఎత్తున దీక్షకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఉప్పరి నరేష్, చిలుముల రాజు, గొడిసెల హరీష్, గొడిసెల పవన్, యూసుఫ్, హైమద్, శేఖర్, సాయి పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి సన్మానం

నవతెలంగాణ-వాంకిడి



మండల జడ్పీటీసీగా ఐదు సంవత్సరాలు విజయవంతంగా పని చేసిన మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్‌ను ఓయూబీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు వైరాగడే రాజకుమార్ శాలువాతో సన్మానించారు. ఐదు సంవత్సరాలు జడ్పీటీసీగా ప్రజల కోసం ఏ అవసరం ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలు పరిష్కరించారని, అదేవిధంగా టిఆర్ఎస్ అధ్యక్షుడుగా పార్టీ తరపున పనిచేసి కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ధైర్యం చెబుతూ కష్టసుఖాలలో తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ దేవినేని గొల్ల, బంబార మాజీ ఎంపీటీసీ వినోద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

▸ భయాందోళనలో అధికారుల విధులు




నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 1992లో పిల్లర్లు లేకుండా నిర్మాణాలు చేపట్టి స్లాబులు వేశారు. నాణ్యత లోపామా..? భవన నిర్మాణాల గడుపు తిరిందా..? అన్నట్టుగా గోడలు నెర్రలు బాసి రెండు భవనాల స్లాబుల పెచ్చులుడిపోతున్నాయి. వర్షం కురిసిందంటే ఉరుస్తున్నాయి. ఆ శిథిలావస్థవకు చేరుకున భవనాల్లో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలో కొనసాగుతున్నాయి. వీటిపై గతంలో పని చేసిన తహసీల్దార్లు ఎంపీడీఓలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందిన లేకుండా పోయింది. రెండు కార్యాలయాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులకు భరోసా లేకుండా పోతోంది. ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు భయం గుప్పిట్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఎంపీడీఓ, తహీసల్దార్ కార్యాలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. గత సంవత్సరం తహసీల్దార్ కార్యాలయం స్లాబు రెండు ఇంచుల మందం మొత్తం ఒ పక్కగు జరిగింది. నెర్రలు వాసింది. ఈ దృశ్యాన్ని చూసిన అందులో రాత్రి పూజ రోజు ఇద్దరి చొప్పున పడుకునే అప్పటి వీఆర్ఏలు, ప్రస్తుత సబ్ ఆర్డినేటర్ సైతం కాపల ఉండడం లేదు. ఏ ప్రమాదం జరుగుతోందనని భయంతో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైన తెలంగాణ ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరుకున్న భవనాలను పరిశీలించి కొత్త భవనాల నిర్మించాలని కోరుతున్నారు.



శిథిలావస్థ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయ భవనం

తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీ కేంద్రాలలో తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా మహిళ అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సమన్వయంతో పర్యవేక్షణతో కూడిన అనుబంధ ఆహారం(ఎస్ఎస్ఎఫ్పీ)పై అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్రాలలో పిల్లలకు సకాలంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి వారి ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మానసికంగా, శారీరకంగా ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి సమయానుసారంగా పౌష్టిక ఆహారంతో పాటు అవసరమైన మందులను అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షణతో కూడిన అనుబంధ ఆహారం విభాగం సమన్వయకర్తలు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి తివారి, రేష దేశాయ్, నరసింహారావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మునవర్ షరీఫ్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల నూతన తహసీల్దార్‌గా మునవర్ షరీఫ్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ నాగరాజ్ గౌడ్ కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కుల, ఆధాయ ధ్రువపత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు విజయ్, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, సిబ్బంది ఉన్నారు.

బీసీ డిక్లరేషన్ తరువాతే ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేసే వరకు వదిలే ప్రసక్తి లేదని, అప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా పిలుపు మేరకు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రూ.50 వేల కోట్ల బడ్జెట్ బీసీలకు కేటాయించాలన్నారు. కానీ రాష్ట్ర బడ్జెట్లో రూ.9200 కోట్లు మాత్రమే కేటాయించడం జనాభాలో 50శాతం ఉన్న బీసీలను మోసం చేయడమే అన్నారు. బీసీలలో అనేక ఉపకులాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించకుంటే భవిష్యత్తులో బీసీలకు అండగా ఉండి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, జిల్లా నాయకులు కొంగ సత్యనారాయణ, ధోని శ్రీశైలం పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి

నవతెలంగాణ-కెరమెరి

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని బాబేఝరి గ్రామంలోని ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. గ్రామంలోని కూలీల వివరాలను తెలుసుకున్నారు. ఆసక్తి గల కూలీలచే మొక్కలు నాటేందుకు కృషి చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శికి సూచించారు. అదేవిధంగా మాస్టర్‌లో ఉన్న పేర్లు గల కూలీలకు మొక్కలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి, కూలీలున్నారు.



ప్రణాళికాబద్ధంగా రుణమాఫీ అమలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన 2వ విడత రుణమాఫీ పథకాన్ని జిల్లాలో ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం 2వ విడత రైతు రుణమాఫీ పథకం నిధులను వర్చువల్ విధానం ద్వారా విడుదల చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ విడతలో రూ.1 లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు రుణం మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో 2వ విడత రైతు రుణమాఫీ పథకంలో 14,623 మంది రైతులకు రూ.153 కోట్ల 34 లక్షల 94 వేల 379లు అందించనున్నట్లు తెలిపారు. ఈ నిధులను ఏక మొత్తంలో రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బ్యాంకులలో రద్దీ లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలలో అధిక మొత్తంలో రైతులు ఖాతాలు కలిగి ఉన్నారని, ఈ క్రమంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా నగదు చెల్లింపులు చేయాలని సూచించారు. రైతులు ఏదైనా సమాచారం కోసం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చని, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో పరిశీలించుకోవాలని తెలిపారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని, 2వ విడత రుణమాఫీ పథకాన్ని నిర్ణీత సమయంలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రూ.153 కోట్ల రుణమాఫీ చెక్కును అధికారులతో కలిసి ఆవిష్కరించి 5 మంది రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతుకు రుణమాఫీ చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సివిల్ సప్లయ్ విభాగంలో పని చేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలిసి సివిల్ సప్లయి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల రేట్లు పెంచడానికి ఏడు నెలల నుండి నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న రేట్లకనుగుణంగా క్వింటాలకు రూ.40 చేయాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీ మేరకు హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతి కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, నాయకులు రాజన్న, దత్తు, దివాకర్, మోహన్, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా
- పలు ఆశ్రమ పాఠశాలల తనిఖీ
- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన
- అనార్‌పల్లి పీజీహెచ్ఎంకు షోకాజు నోటీసు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా

నవతెలంగాణ-కెరమెరి

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆశ్రమ ఉన్నత పాఠశాల హట్టి, అనార్‌పల్లితో పాటు కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పీఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. వసతి గృహాలు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న అనర్‌పల్లి పీజీహెచ్ఎంకు షోకాజు నోటీసు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సరిత, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీ కావడంతో వారిని సత్కరించారు. మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సిబ్బందితో కలిసి శాలువాలతో సన్మానించారు. ఆఫీస్ సబార్డినేట్ శ్రీనివాస్ ఆడిట్ ఆఫీస్‌కు బదిలీ కాగా సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు గోపాల్, సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో బోనాల సందడి

- ప్రధాన వీదుల కూడా శివసత్తుల నృత్యాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో మంగళవారం బోనాల సందడి నెలకొంది. ఆషాడం మాసం బోనాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తులు నెత్తిపై బోనం కుండలతో డప్పు చప్పుళ్ళు, నృత్యాల మధ్య కాలనీవాసులు బోనం సమర్పించారు. పెద్ద ఎత్తున బోనాల కోసం కాలనీవాసులు తరల్లడంతో పండగ వాతావరణం నెలకొంది. సందర్భంగా మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఉద్దేశంతో బోనాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా మదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉత్సవాన్ని వైభంగా నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. ఆలయంలో పూజలు చేసినంతరం భక్తులు బోనాలు వేశారు. కార్యక్రమంలో శివసత్తులు రవి, కీర్తి రేణుక, సిరికొండ నీల, పోశక్క, ఎన్న పుష్ప, రాపర్తి చిలుకమ్మ, అమ్మక్క, మహిళలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-వాంకిడి



నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రియాజ్ అలీఖాన్‌ను మండల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి పలు విషయాలపై చర్చించారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమ్యలను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు యశ్వంత్‌రావు, బాబా, సోమేశ్వర్, రాంబాబు, జయంత్‌కుమార్, మోహన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు : కమిషనర్ సతీష్

నవతెలంగాణ-నస్పూర్



ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. మంగళవారం ప్లాస్టిక్ వాడుతున్న దుకాణాలను గుర్తించి రూ.5000 జరిమానా వేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ 120 మైక్రాన్ కంటే తక్కువ మందము గల ప్లాస్టిక్ సంచులను, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకమును షేధించబడమైనదని అన్నారు. నస్పూర్ పట్టణ ప్రజలు, వివిధ వ్యాపార యజమానులు 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందంగల ప్లాస్టిక్ సంచులను, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను ఎవరు వాడకూడదని, వాడితే వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ దండు తిరుపతి, ఎనివ్వనమెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, భానుచందర్ పాల్గొన్నారు.

గంజాయిపై సమరమే

- డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో తనిఖీలు
- మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో గంజాయి అంతానికి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు. మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి తాగిన వారిని గుర్తించేలా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ లకు గంజాయి టెస్ట్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో గంజాయి టెస్ట్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గంజాయిని అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నమని, దానికోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గంజాయిపై సమరానికి ప్రజలు తోడ్పాటు అందించాలని, గంజాయి నిర్మూలించేందుకు పోలీసులతో పాటు జిల్ల ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, సీఐ భన్సీలాల్, ఎస్ఐ సనత్ పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి వినతి



నవతెలంగాణ-నస్పూర్

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, క్రైస్తవుల మనోభావాలను కించపరుస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌ను నిలిపివేయాలని కోరుతూ మంగళవారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్‌లకు మంచిర్యాల జిల్లా పాస్టర్లు అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సోషల్ మీడియా మాధ్యమాల్లో అనేకమైన మత వివాదాలు, మత విమర్శలను జరుగుతున్నాయని, ఒకరి మీద మరొకరు భయంకరంగా విమర్శస్తూ మత శక్తులు ఉన్మాదంగా క్రైస్తవ మతాన్ని క్రైస్తవులను విమర్శిస్తూ క్రైస్తవుల మనో భావాలను కించపరుస్తున్నారని, యూట్యూబ్ ఛానల్స్, ఫేస్ బుక్ అనేకమైన మీడియా మాధ్యమాల ద్వారా కించపరుస్తూ దూషిస్తూ క్రైస్తవులను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ మత విశ్వాసాలను శివ శక్తి ఛానల్, ధర్మరక్షణ ఇంకా కొన్ని మాధ్యమాల ద్వారా బైబిల్‌ను విమర్శిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మతాల మధ్య రెచ్చ గొట్టే విధంగా మాట్లాడుతూ గొడవలు చేయాలని కుట్రలు చేస్తూ భయాందోళన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా పాస్టర్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ శ్యామ్యూల్, ఉపాధ్యక్షులు కే ప్రసాద్, జనరల్ సెక్రటరీ ఏసుదాస్, మండల ఇన్‌చార్జి రాజేష్, టీపీఎఫ్టి ప్రెసిడెంట్ మ్యాతుప్ ఎం జార్జ్, జనరల్ సెక్రటరీ బి జోషి, కో ఆప్షన్ నెంబర్ అనీల్ కుమార్, నాయకులు ముత్తినేని రవి కుమార్ పాల్గొన్నారు.

నాడు ఏరియా ఆస్పత్రి.. నేడు పశువుల పాక..!

నవతెలంగాణ-మందమర్రి



ఒకప్పటి సింగరేణి ఏరియా ఆస్పత్రిని ప్రస్తుతం పశువుల పాకగా మార్చి వినియోగిస్తున్నారు. మందమర్రి ఏరియా బొగ్గు బావులు కార్మికులతో నిండుగా కళకళ లాడిన సమయంలో కార్మికులు కార్మికుల కుటుంబాల అవసరాల కోసం సింగరేణి యాజమాన్యం దొరల బంగళా ప్రాంతంలో ఏరియా ఆస్పత్రిని లక్షలు వెచ్చించి నిర్మించింది. అనేక సంవత్సరాల పాటు కార్మికుల కుటుంబాలకు సేవలు అందించింది. కాలక్రమేణా గనులు మూత పడి కార్మికుల సంఖ్య తగ్గడంతో 2015 నుండి ఆస్పత్రిలో వైద్య సేవల్ని నిలిపివేశారు. అనంతరం ఆస్పత్రి భవనం కాస్త సంవత్సరాలపాటు నిరుపయోగంగా మారింది. దీంతో మందు బాబులకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. దీనిని ఆసరాగా చేసుకున్న స్థానిక పశువుల వ్యాపారులు కొందరు కొన్నేళ్ల నుంచి భవనాన్ని సొంత ఆస్తిలా భావించి పశువులను కట్టేయడం గడ్డి మోపులు దాచుకోవడానికి తాళాలు వేస్తూ వినియోగించుకోవడం పట్ల స్థానికులు సింగరేణి కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రి భవనాన్ని వాడుకోవడం సింగరేణి అధికారులకు ఎస్ అండ్ పీసీ సిబ్బందికి తెలియదా లేక తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా వెంటనే స్పందించి, నిరుపయోగంగా ఉన్న ఆస్పత్రి భవనాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కార్మిక కుటుంబాలు కోరుతున్నారు.

చెస్ పోటీల్లో గెలుపొందిన వారికి సన్మానం



నవతెలంగాణ-లక్షట్టిపేట

మంచిర్యాల జిల్లాలో ఎక్సలెంట్ చెస్ అకాడమీ జూనియర్స్ అండర్ 15 చెస్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. ఈ టోర్నమెంట్లో లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు క్యాతం సమ్మిత్, సిహెచ్ ఆశిష్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో క్యాతం సమ్మిత్, జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు.. అదేవిధంగా సీహెచ్ ఆశిష్ అండర్-13 విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంక్ సాధించాడు. వరుసగా కొనసాగిన ఐదు రౌండ్లలో విజయం సాధిస్తూ ఇద్దరూ మూడవ ర్యాంకులో జిల్లా స్థాయిలో నిలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాఠశాల కరస్పాండెంట్, ప్రెస్ బీటర్ ఇన్‌చార్జి ఎస్. డేవిడ్ పాల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వరుసగా మూడో ర్యాంకులో ఇద్దరు విద్యార్థులు చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. చదువుతోపాటు ఆటలలో కూడా రానిస్తే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. గత వారం 15 రోజులుగా పీఈటీ ఆశిష్ ఆధ్వర్యంలో మెలుకువలు నేర్చుకుంటూ జిల్లా స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల జస్టిన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. డేవిడ్ పాల్, వార్డెన్ ఇన్‌చార్జి సత్యవతి, థామస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చలో ఢిల్లీ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ వర్గీకరణకై ఆగస్టు 9,10 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని మాదిగ హక్కుల దండోరా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండకూరి రాజు అన్నారు. మంగళవారం జన్నారం ప్రెస్ క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్రం వచ్చిన రోజు నుంచి నేటి వరకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, అవకాశాలలో మాదిగలకు న్యాయం జరగలేదన్నారు. ఎంతోమంది నాయకుల జీవితాలను త్యాగం చేసి, ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వీరత్వం పొందిన మాదిగ అమరవీరుల సాక్షిగా 30 సంవత్సరాలుగా రాజ్యాంగబద్ధంగా ఎస్సీవర్గీకరణకు సుదీర్ఘంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నాం అన్నారు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాదిగలపై సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరనే జరగకపోతే దళిత జాతిలో ఉన్న కొన్ని ఉపకులాలు దేశంలో అంతరించిపోయే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు, బీజేపీకి మాదిగ, మాదిగ ఉపకులాలపైన ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ప్రస్తుతం నడుస్తున్న పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్నటువంటి అనేక సమస్యలపైన సుప్రీంకోర్టులో కేసులు ఉన్నప్పటికీ వాటన్నిటిని బీజేపీ ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించడం జరిగిందన్నారు. అలాంటప్పుడు ఒక చిన్న అంశమైన ఏబీసీడీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందో దేశంలో వెనుకబడిన దళిత జాతి ప్రజలకు బీజేపీ సమాధానం చెప్పాలని అన్నారు. దక్షణాది రాష్ట్రాల ప్రజలతో హైదరాబాదులో లక్షలాదిమంది మాదిగలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభలు నిర్వహించి వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి, కనీసం పార్లమెంట్లో వర్గీకరణ ఉసేతకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఫౌండర్ మర్మంగుల మల్లేష్ మాదిగ జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి రాజలింగం, ఖనాపూర్ ఇన్‌చార్జి కె.ప్రశాంత్, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొండుకూరి ప్రభుదాస్, మండల నాయకులు జంగం రవి, మాజీ ఉపసర్పంచ్ ముల్కల రమేష్, దుమల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

వీధుల్లో సంచరిస్తున్న పశువులను ఇండ్లలో కట్టేసుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

వీధులలో సంచరిస్తున్న పశువులను ఇండ్లలో కట్టేసుకోవాలని లేని యెడల గోశాలలో వేయించి చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని ఎస్ఐ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెయిన్ రోడ్డు, సిగ్నల్ పాయింట్, వీధులలో, అందుగులపేట, బురదగూడెం హైవే పై ఆవులు, ఎద్దులు నిత్యం రోడ్ల పైనే ఉంటున్నాయన్నారు. ఈ పశువుల వలన వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. ప్రధాన రోడ్డుపై పశువులు నిద్రించడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ ఆవులు, ఎద్దుల యజమానులు వాటిని తమతమ ఇండ్లలో కట్టేసుకోవాలని, లేని యెడల మున్సిపాలిటీ అధికారుల సహకారంతో గోశాల లేదా బంజర దొడ్లలలో వేయడం జరుగుతుంది. అంతే కాకుండా ఆ పశువుల వలన ఏదైనా ప్రమాదం జరిగితే వాటి యాజమానుల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రేచీని పంచాయతీలో గేదెల వేలం

నవతెలంగాణ-తాండూర్

రేచిని గ్రామ పంచాయతీ పరిధిలో గల బంజరు దొడ్డిలోని దున్నలు (03), బర్రెను ఆగస్టు 1న వేలం వేయనున్నట్టు పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. గేదలు గత 20 రోజులుగా బంజరు దొడ్డిలో ఉంటున్నప్పటికీ గేదెల యజమానులెవ్వరు సంప్రదించలేదని ప్రకటించారు. గ్రామ పంచాయతీ వారు అన్ని మండలాలకు, గ్రామ పంచాయతీ వారికీ సమాచార నిమిత్తం ఈ-నోటీసును ఇవ్వడం జరుగుచున్నదని తెలిపారు. నిర్ణీత వేలంలోపు గేదెలకు సంబంధించిన యజమానులు తగు ఆధారాలతో రేచిని గ్రామ పంచాయతీ వారిని సంప్రదించాలని కోరారు.

ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి




నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని అంబేద్కర్ యువజన సేవా సమితి అధ్యక్షుడు గంగాధరి మల్లేష్ కోరారు. మంగళవారం ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, డీజీఎం అజాదుల్లా ఖాన్‌ను కలిసి వినతీ పత్రం అందజేశారు. ప్రభావిత పెగడపల్లి గ్రామంలో సింగరేణి యాజమాన్యం ఏమాత్రం అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. డస్ట అలవెన్స్, సీఎస్ఆర్ నిధులు విడుదల అవుతున్నా ప్రభావిత గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. పెగడపల్లి గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి అంబేద్కర్ భవనం నిర్మించాలని కోరారు. అదేవిధంగా ఆస్పత్రి, పాఠశాల విద్యార్థులకు ఆట స్థలం ఏర్పాటు చేయాని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సేవా సమితి సభ్యులు గంగాధరి మధు, ఎనగందుల రవి, రవితేజ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

నవతెలంగాణ-జన్నారం

రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులతో రెండవ విడత రుణమాఫీ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.1.50 లక్షలలోపు రైతు రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సీఎం వివరించారు. రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. రైతులు ప్రభుత్వానికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మల్యాల త్రిసంధ్య, అక్రముల్ల, దివ్య సాయి కుమార్, మధుకర్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



జన్నారంలో..



తాండూర్‌లో..

తాండూర్ : రైతు సంక్షేమమే గేయంగా అక్క కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా తెలిపారు. మంగళవారం కొత్తపెల్లి రైతు వేదికలో ఏర్పాటుచేసిన రెండోవ విడత రైతు రుణమాఫీ పథకంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలోని అర్హులైన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని అమలుపరిచిందని తెలిపారు కొన్ని సాంకేతిక కారణాలవల్ల రైతులందరికీ రుణమాఫీ జరగలేదని తెలిపారు. రైతులు ఆందోళన పడవద్దు అన్నారు. వ్యవసాయ అధికారులు బ్యాంకు అధికారుల సహాయంతో సహాయంతో అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, ఆదర్శ రైతులు, ఏఇఓ శంకర్, పుష్పలత, ధనలక్ష్మి, మాజీ జడ్పీటీసీ బండి పోశం, మసాడి తిరుపతి సింగల్ విండో డైరెక్టర్ బండి రమేష్ బాబు, దుర్గం మహేందర్ పాల్గొన్నారు.


2వ విడత రుణమాఫీ అమలు



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం చేపట్టిన 2వ విడత రుణమాఫీలో అర్హత గల ప్రతి రైతు లబ్ధి పొందేలా ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ శాసనమండలి ప్రాంగణం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ పద్ధతిన 2వ విడత రైతు రుణమాఫీ పథకం నిధులను విడుదల చేయగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా గ్రామీణాభివృద్ధి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ 2వ విడతలో రూ.1 లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు రుణం మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో 2వ విడత రైతు రుణమాఫీ పథకంలో 14104 మంది రైతులకు రూ.138 కోట్ల 46 లక్షల 56254 అందించడం జరుగుతుందని తెలిపారు. రుణమాఫీ మొదటి విడతలో 28727 మంది రైతులకు రూ.151 కోట్ల 27 లక్షల 19 వేల 35 అందించడం జరిగిందని తెలిపారు. రుణమాఫీ నగదు మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బ్యాంకులలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా నగదు చెల్లింపులు చేయాలని తెలిపారు.

గిరిజన గ్రామాల మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేయండి



నవతెలంగాణ-తాండూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాలను కలుపుతూ కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ(ఎన్జీఓ) ప్రతినిధి దాసరి విజయ కోరారు. మంగళవారం ఆసిఫాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించి పెద్దపెల్లి ఎంపీకి పోస్ట్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. రామగుండం, రాఘవపురం, జన్నారం, బజారహత్నూర్, ఇంద్రవెల్లి మీదంగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆదివాసులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం లేక వెనుకబడి పోతున్నారని తెలిపారు. రైలు రవాణా సౌకర్యం లేనందువల్ల గిరిజన ప్రాంత ఉత్పత్తులకు స్థిరాస్తులకు సరి అయిన గిట్టుబాటు రావటం లేదని తెలిపారు. రైలు ప్రయాణ సౌకర్యం లేకపోవడం వల్ల గిరిజనులు వైద్య, విద్య, వ్యాపార రంగాల్లో వెనుకబడి పోతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన గ్రామాల మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేసినట్లయితే గిరిజన గ్రామాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని తెలిపారు. అధికారులు నాయకులు స్పందించి రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

గంజాయితో పట్టుబడ్డ యువకులు

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయితో ఉన్న నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్ ఆదేశాల మేరకు ఉదయం సమయం లో మంచిర్యాల పట్టణంతో పాటు మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను తనిఖీలు చేసే క్రమంలో స్టేషన్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, బల్లర్షకు చెందిన రిజ్వాన్ వద్ద నుంచి మంచిర్యాలకి గంజాయిని తెప్పించి పట్టణంలో రూ.200లకు ప్యాకెట్ చొప్పున అమ్ముతున్నట్లు నేరం ఒప్పుకున్నారు. గత మూడు రోజుల క్రితం రిజ్వన్‌కు గంజాయి కావాలని ఫోన్‌లో సమాచారం అందించగా ఈ రోజు ఉదయం రూ.16 వేల విలువ గల గంజాయిని తెచ్చి వారికి ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న బుక్య సారయ్య, అల్మేకర్ శ్యామ్, వెంకటేష్ లతో పాటు రిజ్వాన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వారి నుండి 1100 గ్రాముల గంజాయి రూ.4 వేల నగదు, నిందితుల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయిని విక్రయించే క్రమంలో చాక చక్యంగా వవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్న పట్టణ సీఐ, ఎస్ఐ, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

సాధన సర్వేపై శిక్షణ తరగతులు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జాతీయ సాధన సర్వే 2024 పై ఒకరోజు శిక్షణా తరగతులను మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తంగళ్ళపల్లి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ సాధన సర్వే 2024 పరీక్షపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నవంబర్‌లో నిర్వహించే పరీక్ష పై విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. విద్యార్థులకు పరీక్షపై పూర్తి అవగాహన పెంపొందించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లేశం, తాండూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అచ్చులాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి స్టేట్ రిసోర్స్ పర్సన్ విద్యాసాగర్, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు వేణుగోపాలరావు, రజిత, సంపత్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జడ్పీ బాలుర పాఠశాలకు టీవీల అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని బాలుర జడ్పీ పాఠశాలకు దాతలు రెండు ఎల్సీడీ టీవీలను విరాళంగా అందజేశారు. డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం ఎంఈఓ విజయ్ కుమార్-శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఆ పాఠశాలకు రెండు ఎల్సీడీ టీవీలను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఎల్సీడీ టీవీల ద్వారా విద్యాబోధన చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ఇసుక అక్రమ రవాణ చేస్తే చర్యలు తప్పవని ఎస్సై ధీకొండ రమేష్ హెచ్చరించారు. మండలంలోని రుద్రారం గ్రామ శివారులో గల రషీద్‌కి చెందిన భారత్ పౌల్ట్రీ ఫారంలో ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండ సుమారు 12 ట్రాక్టర్‌ల లోడ్ ఇసుక డంప్ చేసి ఉందన్న సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. 12 ట్రాక్టర్ ట్రిప్పులు లోడ్‌గా ఉన్న ఇసుక కుప్ప ఉన్నట్లు గుర్తించారు. సరైన ఆధారాలు లేనందున రెవెన్యూ అధికారులు పోలీస్‌తో కలిసి జప్తు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఇసుక అక్రమంగా రవాణ చేస్తే చట్ట రీత్యా చర్య తీసుకుంటామన్నారు. దాడిలో ఆర్ఐ జుగాది రావు, జూనియర్ అసిస్టెంట్ ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం

నవతెలంగాణ-రెబ్బెన



ప్రభుత్వ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్ రావును గోలేటి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడంలో అధికారుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లావుడ్య పల్లాస్, దుర్గం రవీందర్, జిల్లాల స్వామి, రహీం, పుదరి సాయి, పార్వతి సాయి, బాలు నాయక్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఉన్న ఆర్ఎంపీ పీఎంపీల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా నాయకుడు రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆర్ఎంపీ పీఎంపీల సమస్యపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. దీనిని అమల్లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ఎంపీ పీఎంపీలకు భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పొన్నాల్, సత్తార్, శ్రీనివాస్ చారి, కేదార్ గౌడ్, మధు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా రవికాంత్

ఆర్ఎంపీ పీఎంపీల సంఘం మండల అధ్యక్షుడిగా సీహెచ్ రవికాంత్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కాగితాల శ్రీనివాస్ చారి, మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా కమ్మల వెంకన్న, సహాయ కార్యదర్శిగా మాజీద్, లింగు శ్రీకాంత్, కోశాధికారిగా బలరాం, సందీప్‌లు ఎన్నిక కాగా నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.

రేపటి నుండి డీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

డీఎడ్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించిన డీ-సెట్ పరీక్షలో ర్యాంక్ సాధించిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 1 నుండి ఆగస్టు 6 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్స్ తో అభ్యర్థులకు కేటాయించిన తేదీలలో డైట్ కళాశాలలో హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

చెట్ల కొమ్మలు నరికివేత



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను మంగళవారం మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం మాట్లాడుతూ చెట్టుకొమ్మలు విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా మారాయని వాటి వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చెట్టు కొమ్మలను తొలగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమానుల్లా ఖాన్, నాయిని సంతోష్, పరిమి సురేష్ మున్సిపాలిటీ, విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లోని వివిధ విభాగాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ తదితర వైద్య పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన వైద్యుల నుంచి ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, సిఎంఓ. పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన వైద్య అభ్యర్థులు ఆగస్టు 6న మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాక్ఇన్ ఇంటర్వ్యూకు అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రలతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆదిలాబాద్.తెలంగాణ.గావ్.ఇన్ లేదా రిమ్స్‌ఆదిలాబాద్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

స్థానిక ఎన్నికల కోసం సన్నద్ధం కావాలి



నవతెలంగాణ-ఉట్నూర్

స్థానిక ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. మంగళవారం మండలంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు గెలుపు కోసం సైనికులుగా పని చేయాలని అన్నారు. అనంతరం స్వర్గీయ రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్, బానోథ్ జగన్, పవార్ దేవిదాస్, ఆడే రమేష్, జిల్లా నాయకులు కొండరి రమేష్, మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలకు వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం చైతన్య దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖయ్యూం డీఎస్పీ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ అధికారిగా ఉండి దివ్యాంగుల పట్ల మానవత్వాన్ని చూపకుండా కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అబ్దుల్ మాజిద్, రమాకాంత్, అహ్మద్‌పాషా, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారంతో పాటు విద్యనందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యార్థులకు మంచి ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ పాఠశాల (బాలురు)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, సిక్ రూమ్, వంటగది, విద్యార్థుల గదులను పరిశీలించారు. ముందుగా రిజిష్టర్‌లను పరిశీలించి, హాజరు ప్రతిరోజు వేయాలని అన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పరిశుభ్రత పాటించాలని అన్నారు. విద్యార్థుల గదులు, సిక్ రూమ్ శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో చెత్త చెదరం పేరుకుపోయి ఉండటంతో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. వంట గదిని పరిశీలించారు. అన్ని గదులను పరిశీలిస్తూ, పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని, పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. అందుకు ఇప్పటి నుండే బాగా చదవాలని, ఏ సబ్జెక్టులో నైన వెనుకబడి ఉంటే ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఏమైన సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడుగగా ఫ్యాన్‌లు లేవని తెలపగా ఆ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రుణమాఫీతో రైతులకు ప్రయోజనం

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

రుణమాఫీతో రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం రాష్ట్ర శాసనసభ ప్రాంగణం నుండి సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో రెండవ విడత రైతు రుణమాఫీ చెక్కులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా రూ. లక్ష యాభై వేల వరకు రుణాలు పొందిన రైతుల రుణం మాఫీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో రెండో విడతలో రుణమాఫీకి సంబంధించి 19058 మంది రైతులకు రూ.200.17 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా 30 వేల 105 మంది రైతులకు రూ.171.6 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందని వివరించారు. మొత్తం రెండు విడతల్లో కలిపి 49 వేల 163 మంది రైతులు రూ. 371.93 కోట్లు జమచేశామన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ డబ్బులు పొందని రైతులు సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారులకు తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ఆధార్ కార్డులలో పొరపాట్ల కారణంగా రైతు రుణమాఫీలో పేరు రాని, ఖాతాలు డబ్బులు జమ కాని రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. సందేహాలుంటే నంబరు 7288894050ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, మండల వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌గా రొడ్డ శ్రీనివాస్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రయివేట్ ఐటీఐ కళాశాల బృందం ఆయనను సత్కరించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రయివేటు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రఘు, అధ్యాపకులు సురేందర్, హ్యనక్, వంశీ, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో డిగ్రీ కళాశాల గిరిజన విద్యార్థిని మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాలలో బీజడ్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మండలంలోని సిర్యన్ మోవాడ్ గ్రామానికి చెందిన కొమరం జంగు సావిత్రిబాయిల కూతురు కుమురం లక్ష్మి(19) అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం విద్యార్థిని శ్వాసకోశతో కొంత అస్వస్థతకు గురి కాగా వెంటనే తమకు సమాచారం అందించి ప్రస్తుతానికి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. మళ్లీ ఆదివారం కూడా అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా వారు పరీక్షల నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి వెళ్ళమని సలహా ఇచ్చారు. అయితే తల్లిదండ్రులు మంచిర్యాల వెళ్లడానికి నిరాకరించి స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించి ఇంటికి తీసుకువెళ్లారు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి విద్యార్థిని భోజనం తర్వాత శ్వాస ఇబ్బందిగా మారడంతో మరణించినట్లు తెలిసింది. విద్యార్థిని మృతి పట్ల కళాశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న చలోఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్టు పేర్కొన్నారు. చలోఢిల్లీ కార్యక్రమంలో మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-నస్పూర్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్‌తో కలిసి జిల్లా మహిళా సమాఖ్య, మండలాల సమాఖ్యల సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మీ-సేవా కేంద్రంలో అదనంగా జిరాక్స్, లామినేషన్, స్టేషనరీ ఇతర సేవలు చేసుకోవచ్చని, గ్రామ సంఘాలు, మహిళా సమాఖ్యల సభ్యులు తమ సంఘాల ఆడిటింగ్ ఎప్పటికప్పుడు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీకి సంబంధించి సభ్యుల ఖాతాలలో బిల్లులు జమ అయ్యేలా చూడాలని తెలిపారు.

మూర్ఛ వ్యాధితో యువకుడి మృతి

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివాజీ నగర్‌కు చెందిన ఉప్పట్ల శ్రీకాంత్(24) మంగళవారం మూర్ఛవ్యాధితో మతి చెందాడు. తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ కథనం ప్రకారం.. శ్రీకాంత్ గత కొన్ని సంవత్సరాలుగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడు. నిన్న సాయంత్రం పొలంలో వరి నారు నాటడానికి వెళ్ళినపుడు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెల్తుండగా మార్గ మధ్యంలో చనిపోయినాడు. మృతుని తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉచిత వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని బాబు జగ్జీవన్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి అన్నారు. జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఇలాంటి శిక్షణల ద్వారా ఉపాధి అవకాశాల లభిస్తాయని పేర్కొన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ రాజు మాట్లాడుతూ శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు ఉన్నారు.



అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆశ వర్కర్లను అరెస్టు చేసి ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ(ఎం) నియోజకవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్ కుమార్ తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా ఆశ వర్కర్లను పోలీసులు నిర్బంధించడాన్ని ఆయన ఖండించారు. అక్రమ అరెస్టులు చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఏపీ సీఎంను కలిసిన ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంతో టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుల్లపల్లి ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ తన కూతురు వివాహ పత్రికను అందజేయడంతో పాటు పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన పలు చర్యలు చర్చించినట్లు తెలపారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని కేజీబీవీలో, నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ప్రణీత, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు అధికారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 13 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. జులై 30 నుంచి ఆగస్టు 1 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పోస్టులకు అర్హత కలిగిన వారు సంబంధిత ఎంఈఓలకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు మహిళలు అర్హులని, 7, 10వ తరగతి విద్యార్హత ఉండాలని సూచించారు.

నేడు విద్యుత్ సేవలకు అంతరాయం

నవతెలంగాణ-కెరమెరి

మండలంలో బుధవారం విద్యుత్ సేవలకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్యాంకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- జిల్లా టాస్క్ సెంటర్ రీజినల్ మేనేజర్ సాయి కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగ యువత టాస్క్ ఆధ్వర్యంలో బ్యాంక్ పోటీ పరీక్షలకు అందించే ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి టాస్క్ ఆధ్వర్యంలో బ్యాంకు సంబంధిత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా టాస్క్ ద్వారా ప్రతి ఒక్కరూ టెక్నికల్ జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. టాస్క్‌లో ఈ శిక్షణలో కాకుండా కంప్యూటర్ సంబంధిత శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ నెంబర్ 9502786438కి కాల్ చేయాలని సూచించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కామారెడ్డిలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మనంద్ అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించేందుకు వచ్చారు. కలెక్టర్ అప్పటికే సమావేశంలో ఉండటంతో గేటు బయట నీరిక్షించారు. ఎంతకు కలెక్టర్ రాకపోవడంతో బైఠాయించి నినాదాలు చేశారు. కలెక్టర్ చాంబర్‌లోనే వినతిపత్రం తీసుకుంటామని చెప్పడంతో వారు బీసీలను అగౌరవ పరిచేలా వ్యవహరించవద్దని చేతులు జోడించడంతో చివరికి కలెక్టర్ వినతిపత్రం తీసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మనంద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డి సభలో కాంగ్రెస్ రాష్ట్రంలో అత్యధికంగా జనాబా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతనే స్థానిక సంస్థలను నిర్వహిస్తామని ప్రకటించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్న పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.9,200 కోట్లు మాత్రమే కేటాయించరని, తక్కువ ఉన్న మైనార్టీలకు రూ.3వేల కోట్లను పెట్టారని ఆరోపించారు. బీసీ అభ్యున్నతికి ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్ ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోగే శోభ, నాయకులు సంతోష్, లాలామున్న, పాయల శరత్, మహేందర్, దయాకర్, దత్త నిక్కం పాల్గొన్నారు.

మట్కా ఆడుతున్న వ్యక్తి పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో మట్కా ఆడుతున్న ఓ వ్యక్తిని మంగళవారం పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ద్వారకానగర్‌లో మట్కా ఆడుతున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేయగా కత్తెరపాక సృజన్‌ను నిషేదిక అప్లికేషన్‌లో మట్కా ఆటను గుర్తించామని, రూ.5 వేల నగదుతో పాటూ నింధితుడి మొబైలు స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ ఎస్సై వెంకటేష్, పీసీలు మధు, రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ

నవతెలంగాణ-రెబ్బెన

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోనాపూర్ గ్రామ యువకులకు వాలీబాల్ కిట్టును ఎస్సై డి.చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోనాపూర్ గ్రామస్తులతో కలిసి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. గంజాయి, గుట్కా, గుడుంబా, జూదం వంటి వ్యాసనాలకు దూరంగా ఉండాలని యువకులకు గ్రామస్తులకు సూచిచారు. అసాంఘిక కార్యకలపాలు కొనసాగితే డయల్ 100కు కాల్ చేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల పరిషత్ కార్యాలయంలో 14వ విడత సామాజిక తనికి ప్రజావేదికను డీఆర్డీఓ విజయ లక్ష్మి, ఎంపీడీఓ సోలమన్ రాజ్, హెచ్ఆర్ సుధాకర్, ఏపీఓ జగన్ మోహన్, ఎస్ఆర్పీ సురేందర్ బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ విజయలక్ష్మీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో 2023-24కు సంబంధించిన వ్యయం రూ.6,10,70,126 ఇందులో కూలీల వ్యయం రూ.5,85,77,764, మెటీరియల్ రూ.24,92,362కు ఖర్చు చేసినట్లు తెలిపారు. రికవరి అయిన కింత మొత్తం రూ.77,124 ఆయా గ్రామాలలో డీఆర్పీ చేసిన సామాజిక తనిఖీలో తెలిశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టి స్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. పరీక్షలకు 20 మంది హాజరుకాగా ఆప్తమాలజిస్ట్ వసీ పరీక్షలు నిర్వహించారు. 10 మందికి శస్త్రచికిత్సలు అవసరమని, వీరికి లయన్స్ క్లబ్ బెల్లంపల్లి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని డాక్టర్ అనీత తెలిపారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు

నవతెలంగాణ- ఖానాపూర్

పట్టణంలోనీ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాల లైట్లను మంగళవారం మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం మాట్లాడుతూ ప్రధాన దహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల లైట్లు రాక చీకట్లో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని క్రేన్ సాయంతో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని బల్గగల మైనార్టీ పాఠశాల, కళాశాలలో మంగళవారం పోలీసు కళాబృందం సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై సోనియా మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో మాయమాటలకు మోసపోవద్దని, సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, షీటీం సేవలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎలాంటి సమస్య ఉన్న 100కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, వెంకటేష్, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డెంగ్యూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కేఆర్కే కాలనీలో పాజిటివ్ కేసు రావడంతో అక్కడ స్ప్రే చేయించారు. చుట్టు పక్కల ఇండ్లలో స్ప్రే చేయించి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. వైద్యులు వారిని పరీక్షించి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్ఎతో పాటు జిల్లా మలేరియ అధికారి శ్రీధర్ కాలనీలో సందర్శించి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నీరు నిల్వ కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియ ఇతర వ్యాధులకు కారణం అవుతాయని డీఎంహెచ్ఎఓ నరేందర్ రాథోడ్ తెలిపారు. ప్రజలు రోగాలు రాకుండా పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు తీసుకోవడంతో పాటు రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో రఘునాథ్, హెల్త్ సూపర్వైజర్ అడే సురేష్, వీబీడీ సబనాజ్, అరుణ్, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు ఒక ఇన్నోవేటర్ కావాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో గల ప్రతి పౌరుడు ఒక ఒన్నోవేటర్‌గా గుర్తించబడాలంటే గ్రామ పంచాయతీల వారిగా గ్రామీణులుక అవగాహణ కల్పించాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఉమ్మడి జైపూర్, భీమారం మండాలల పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహణ కల్పించారు. పరిపాలన సౌలభ్యం, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా గ్రామాలలో గల పౌరులు ఆగస్టు 3 వరకు తమ ఆలోచనా, అభిప్రాయాలను తెలిజేయాలని తెలిపారు. ఈ సంధర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, భీమారం, జైపూర్ మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. మంగళవారం డీఈఐఓ రవీందర్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం లేక వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట వెంటనే విడుదల చేయాలని, కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు స్వాతి, మౌనిక, త్రిష పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలుకు ఉద్యమిద్దాం

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య
- ఆగస్టు 1న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఖానాపూర్‌లోని విశ్రాంతిభవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలనే డిమాండ్‌తో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు ఒకటో తేదీన అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. పార్టీ చేపడుతున్న ఈ కార్యక్రమాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ నిరంకుశ పాలన పోయి కాంగ్రెస్ పాలన వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నో వాగ్దానాలు చేసిందన్నారు. ఆరు గ్యారంటీలు ఇంకా ఎన్నో హామీలు మేనిఫెస్టో చేర్చారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలల పూర్తి కావస్తున్న ఇచ్చిన వాగ్దానాల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. వెంటనే రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇల్లు, ఇండ్ల స్థలాలు, ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. పోడు సాగుదారులందరికి పట్టాలివ్వాలన్నారు. నిరుద్యోగుల ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన రూ.12వేలు జీవన భృతిని వెంటనే ఇవ్వాలన్నారు. వాటితో పాటు ఇతర డిమాండ్లతో జరిగే ఆందోళనను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ప్రజాపంథా మండల నాయకులు అంకూష్‌రావు, జక్కుల రాజన్న, కుంచెపు ఎల్లయ్య, శంకర్, రాజన్న, మధు, శ్రీనివాస్, సుంగు, లక్ష్మణ్, లచ్చన్న ఉన్నారు.



కరెంట్ షాక్‌తో షాపు దగ్ధం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఇందిరా మార్కెట్ సమీపంలోని అప్నాబజార్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి దగ్ధమైనట్టు బాధితుడు షఫీ తెలిపారు. దుకాణం నుంచి మంటలు వస్తున్నట్లు చుట్టుపక్కలవారు సమాచారం మేరకు షాపు వద్దకు చేరుకున్నారు. ఫైరింజన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నాయకుడు అర్షద్ హుస్సేన్‌తో పాటు పలువురు బాదితుడిని పరామర్శించారు.

పేకాట స్థావరాలపై దాడి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చిన్న బెండార గ్రామం శివారులో మంగళవారం సాయంత్రం పేకాట స్థావరాలపై ఎస్ఐ సాగర్ దాడులు నిర్వహించారు. చిన్న బెండార శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా పేకాట, మట్కా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన గ్రామపంచాయితీ సింగల్‌గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లావుడ్య కిషన్ సతీమణి ఇటీవల మరణించగా ఆయనను, మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు శంకర్ కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ పరామర్శించారు. బాదిత కుటుంబాలను ఓదార్చి సానుభూతి తెలియజేసి ప్రభుత్వ పరంగా సాయం అందేవిధంగా ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, ఎస్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, పట్టణ అధ్యక్షుడు వనమల మురళీ, చిరంజీవి గౌడ్, కుసుమ విజయ, ముంజం రవీందర్, పుదరీ హరీష్, దుర్గం మహేష్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు బీఆర్ఎస్ మద్దతు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు చేపడుతున్న ఆందోళనకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటూ బకాయి పడ్డ ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంబాల ఓదెలు, నక్క మనోహర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ సంపాదించాలనే దురాశతో ఆసిఫాబాద్‌కు చెందిన జి.గోపాల్ మంగళవారం రేషన్ బియ్యాన్ని టాటా మ్యాజిక్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాంకిడి పోలీసులు టాటా మ్యాజిక్‌ను ఆపి తనిఖీలు చేయగా 10.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైంది. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ(ఏ)లోకి మార్చాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

ముదిరాజ్‌లను బీసీ(డి) రిజర్వేషన్ నుంచి బీసీ(ఏ)లోకి మార్చాలని మండల ముదిరాజ్‌లు కులస్తులు అన్నారు. మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 14శాతం ఉన్న తమకు బీసీ(డి) రిజర్వేషన్ ఉండటం వల్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనుకబడుతున్నామని, ఎలాగైనా బీసీ(ఏ)లోకి మార్చి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గంగాధర్, నారాయణ, సవీన్ కుమార్, యోగేష్, రాజు ఉన్నారు.

తండాల్లో ఘనంగా సీత్లా వేడుకలు

నవతెలంగాణ-నేరడిగొండ

లంబాడీ గిరిజన తండాల్లో ఘనంగా సీత్లా వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. లంబాడాల సాంప్రదాయాల ప్రకారం మండలంలోని వాగ్దారి గ్రామంలో సిత్ల పండుగను ఘనంగా నిర్వహించారు. సిత్లనే దాటుడు అని పిలుస్తారు. ఏడు రాళ్ళను సాత్ భవాణిగా కొలుస్తారు. పశువులను దాటించడం సిత్ల ప్రాముఖ్యత. ప్రతి ఇంటి నుంచి కంది, జొన్నలతో చేసిన గుడాలను సంస్కృతి సంప్రదాయలతో గిరిజన వస్త్ర వేషధారణలతో డప్పు చప్పుడు మధ్య ఆటపాటలతో నృత్యాలు చేస్తూ మహిళలు గుగ్రీ నైవేద్యం, సిత్ల సాత్ భవానిలకు సమర్పించారు. గ్రామ పశువులను సాత్ భవాని, పోతురాజు మధ్య ఏర్పాటు చేశారు. కాలం మారిన గిరిజన లంబాడీ సంస్కృతి సాంప్రదాయం మారదని దీనికి నిదర్శనం. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.